# అతిధి భాగోతం కధ

---వంగూరి చిట్టెన్ రాజు, హ్యూస్టన్, టెక్సస్

శివరాంకి తన ఇంట్లో ఆ గది అంటే చాలా ఇష్టం. అఖిల అమెరికాలో అందరూ వారానికొక సారి తిట్టుకుంటునో, పూర్వకాలపు బామ్మల్లా సణుగుకుంటూనో ఆ గది క్లీన్ చేస్తే, శివరాం మటుకు, ప్రతి రోజా సంధ్యావందనం చెయ్యడు, కానీ వీలున్నప్పుడల్లా ఆ గది శుభ్రం చేస్తుంటాడు. వాడు కొన్న రెండు వందల పాతిక పైగా క్లీనింగ్ చేసే ద్రావకాలు, పౌడర్లు, చీపుర్లు, బ్రష్‌లు, స్పాంజిలు అన్నీ వాడి ఏ పద్ధతిలో ఆ గదిని తాజ్‌మహల్ కంటే అందంగా చెయ్యొచ్చో అని ప్రయోగాలు చేస్తూ ఉంటాడు. ఆ గదికూడా నెల్లూరు నుంచితెప్పించుకున్న మార్బుల్ రాతితో కట్టిందే.

ఆ రోజు సాయంత్రం ఆఫీసునుంచి రాగానే ఆ గదిలో తన ఎనిమిదో ద్రావకం ప్రయోగం మొదలు పెడుతుండగా ఫోను మోగింది.

"శివరాంగారూ, నేనండీ, మన మహాసభల హాస్పిటాలిటీ కమిటీ చైర్‌పెర్సన్ రావ్ డి. సుబ్బాని."

"ఓ, దైవోపహతుల సుబ్బారావు గారా? ఎలా ఉన్నారు? మహా సభల హడావుడిలో చాలా బిజీగా ఉండి ఉంటారు." అన్నాడు శివరాం రిమోట్ ఫోన్ తీసుకుని, ద్రావకాన్ని, కామెట్ క్లీనింగ్ పౌడరుని సమ పాళ్ళలో కలుపుతూ, అందులో కాస్త చింతపండు కూడా వేద్దామా అని ఆలోచిస్తూ.

" అదేనండీ, మీరు పాత కాపులు. ఇలాటి సభలు ఎన్నో చూశారు, మీకు తెలియనిది ఏముందీ? ఇండియా నుంచి ఒకాయన రేపు కాంటినెంటల్ ఫ్లైట్‌లో దిగుతున్నట్టు ఆఖరి క్షణంలో ఈ-మెయిల్ ఇచ్చాడు. ఆయన అమెరికా మొదటి సారి వస్తున్నాట్ట. పాటలు పాడతాడో, గెంతులేస్తాడో తెలియదు. ఎయిర్ పోర్ట్‌కి వెళ్ళి తీసకురావడానికి మాకు ఎవరికీ కుదరక, మీకు ఎయిర్ పోర్టు కాస్త దగ్గరే కదా, మీరు ఆయన్ని పికప్ చేసుకుని జస్ట్ రెండు, మూడు రోజులు హోస్ట్ చెయ్యగలరేమోనని స్పెషల్‌గా రిక్వెస్టు చేస్తున్నాను."

"నేనా, ఇలాటి వన్నీ పూర్వం చేసేవాణ్ణనుకోండి, కానీ......" నసిగాడు శివరాం.

"మీరు కాదంటే కుదరదు సార్, ఇదేదో లాస్ట్ మినిట్‌లో తగిలింది. మీరు కాస్త "ఊ" అనండి.. ఆయన వచ్చిన తర్వాత కావాలంటే ఇంకో చోటకి షిఫ్టు చేస్తాం. జస్ట్ టు ఆర్ త్రీ డేస్ అంతే. కావాలంటే మీ ఆవిడతో నేను వ మాట్లాడతాను." బతిమాలాడు రావ్ డి. సుబ్బా.

"మా ఆవిడతో మాట్లాడతారా, అబ్బే, అక్కర్లేదు లెండి. ఐ విల్ మేనేజ్, ఫ్లైట్ డిటైల్స్ ఇవ్వండి. ఫరవా లేదు,"

అహం బెబ్బ తిని అనాలోచితంగా ఒప్పేసుకున్నాడు శివరాం. ఆవిడ పవరు అందరికీ తెలిసిందే కాని మరీ ఇంత ఇదా?

నిన్న సాయంత్రం శివరాం ఎయిర్ పోర్టుకి వెళ్ళి, ఇండియానించి అమెరికా దేశవాళీ సభలకి వచ్చిన ఒక ఆసామీని తన ఇంటికి తీసుకొచ్చాడు. ఆయన కాషాయం రంగు సఫారీ సూటు వేసుకున్నాడు. గాంధీ గారి టైములో అంగవస్త్రం, నెహ్రూ గారి టైములో గులాబీపువ్వు పెట్టుకోడానికి వీలుగా కుట్టిన లాంగ్ కోటూ, ఎన్.టి. ఆర్ టైములో కాషాయ వస్త్రాలూ లాటి రకరకాల దుస్తులు చూశాడు. కానీ, ఈమధ్య ఇండియాలలో ఆఖరికి కవులూ, పండితులూ కూడా నుదిటి మీద నామాలు, లేదా విభూతీ, పంచెలూ, కండువాలూ మానేసి అందరూ సఫారీ సూట్లే ఎందుకు వేసుకుంటున్నారు అనేది శివరాంకి అంతుపట్ట లేదు. అసలుఈ సఫారీ సూటు ఎవరు కనిపెట్టారు, సఫారీ సూటు అనే పేరు ఎందుకు, ఎలా వచ్చింది మొదలైన వివరాలు తెలుసుకోవాలని చాలాకాలంగా శివరాంకి కుతూహలంగా ఉంది. అసలు సిసలు దొరలు, అంటే సామ్రాజ్యవాదులు వేసుకునే సూట్ వేసు కోడానికి అహం అడ్డు వచ్చి, స్వదేశీ కోటుగా చెలామణీ అవడానికి ఇండియాలో బహుశా డబ్బున్న లెఫ్టిస్ట్ వాదులో, లేదా ఒక బ్రిలియంట్ మార్కెటింగు వాడో కనిపెట్టిన "ఉడతా దేశ భక్తి కోటు" ఈ సఫారీ డ్రెస్సు అని శివరాం అభిప్రాయం. మన ఆడవాళ్ళు సాంప్రదాయకంగా వస్తున్న చీరలూ, యుక్త వయస్కులైన తెలుగు ఆడపడుచులు లంగాలూ, వోణీలూ తీసి అవతల పారేసి......అంటే అసలు బట్టలులేకుండా అని కాదు సుమా,... పంజాబీ బట్టలు, పేంట్లూ, చొక్కాలూ వేసుకుంటున్నారు కానీ,సఫారీ సూటుకి కౌంటర్ పార్టుగా ఆడవాళ్ళకి గిఫారీ సూట్లు ఇంకా ఇండియాలో ఎందుకు రాలేదు అని కూడా శివరాంకి సమాధానం లేని ప్రశ్న. ఈ రోజుల్లో ఒక్క సన్యాసులు మాత్రమే సూట్లూ, బూట్లూ వేసు కోకుండా కాషాయ వస్త్రాలు వేసుకుని, మన సాంప్రదాయాన్ని పాటిస్తున్నారని శివరాం అభిప్రాయం.

సన్నాసుల..సారీ, సన్యాసుల సాంప్రదాయమైన ఈ కాషాయ రంగు సఫారీ ధరించి దివి నుంచి భువి కి దిగివచ్చిన ఈ ఆసామీ గారు మోడర్న్, హైటెక్ స్వామీజీయా, పండితుడా, రాజకీయవాదా, గవర్న మెంటు అధికారా, మరొక కొత్త కేటగిరీ ఏమన్నావచ్చిందా అని శివరాం కాస్త తత్తర పడ్డాడు. ఎవరైతేనేంలే, ఉన్న మూడు రోజులూ తన సంసారంలో గొడవలు తేకుండా ఉంటే చాలని ఇష్టదేవతలని ప్రార్థించాడు. ఎందు కంటే పూర్వ కాలంలో ఎవరైనా అతిధులు వచ్చినప్పుడు శివరాం భార్య గీర్వాణి...ఇండియాలో ఆవిడ పేరు మధురవాణి...వాణ్ణి బెడ్ రూమ్‌లోకి రాగానే స్టీరియో సౌండులో బడబడానూ, కొండొకచో పబ్లిక్ గానూ చీవాట్లు వేసేది కొంపలో వీళ్ళంతా ఏమిటీ అని. ఈ రోజుల్లో మాటలతో పాటు చేతలు కూడా జోడించి, ఆ అతిథిగారు ఉన్నన్నాళ్ళూ ఓవర్ టైమ్ పని అని వంక చెప్పి వర్కుకి పారిపోవడమో, లేదా ఊర్లోంచి మకాం ఎత్తేసి ఆవిడ అనుంగు తమ్ముడి దగ్గరికి పోవడమో చేస్తుంది. శివరాంకి మటుకు వాళ్ళింట్లో ఆంధ్రా తాజ్ మహల్ అందరికీ చూపించాలని తపనతో అప్పుడప్పుడు ధైర్యం చేసి అతిథులని తీసుకొస్తూం టాడు, ఇదిగో ఈ కాషాయం సఫారీగారిలా.

ఇంటికి వెళ్ళగానే గీర్వాణి ఆయనకేసి అదోలా చూసి, అంతకంటే అదోలా శివరాంని చూసి షాపింగుకి వెళ్ళి పోయింది, నా గురించి వెయిట్ చెయ్యకండా భోజనాలు చేసెయ్యండి, ఎప్పుడు వస్తానో తెలియదు  అంటూ . పిల్లలు హాయ్ అంకుల్ అనేసి, అంకుల్‌గారి నోరు పెగిలో లోపుగా కంప్యూటర్ లో ఇన్‌స్టంట్ మెసేజ్‌లలో ఫ్రెండ్స్‌ని పిలవడానికి వాళ్ళ గదులలోకి పారిపోయారు.

చంద్రబాబు నాయుడి గొప్పతనం గురించి నాలుగు మాటలు చెప్పుకుని భోజనం చేద్దామా సార్ అనిఆయన్ని అడగగానే "భోజనానికేం, చేద్దాం, కానీ, దానికిముందు ఏమన్నా ఏర్పాటు ఉంటే బావుంటుందేమో"అన్నారు ఆ ఆసామీ గారు.

"ఏర్పాటా? అంటే?" అడిగాడు శివరాం.

"అదేలెండి, అమెరికా సరుకు"

"అమెరికా సరుకా?" శివరాం ట్యూబ్‌లైట్ ఇంకా వెలగలేదు.

" ఏం లేదు సార్, నాకు చిన్నప్పటినుంచీ భోజనానికి ముందు కొంచెం దాహం అలవాటు. అఫ్  కోర్స్ పెద్ద పట్టింపు లేదనుకోండితిన్న అన్నం అరగాలిగా, అందుకు ఏపిటైజర్‌లా అన్నమాట" నసిగాడు  ఆసామీ గారు.

"భలే వారు సార్, అలాంటివి మా ఇంట్లో అలవాటు లేవండి. మా గురించి మా హోస్ట్ కమిటీవారికి స్పష్టంగా తెలుసు కూడానూ. కావాలంటే మంచి ఆరంజి జ్యూసో, ఏపిల్ జ్యూసో ఇస్తాను. ఆరోగ్యానికి  చాలా మంచిది. ఆరోగ్యమే మహాభాగ్యము కదా అన్నారు పొట్టి శ్రీరాములు గారో, వేమనగారో, మరెవరో "అన్నాడు శివరాం.

"ఫరవాలేదు సార్, మీరు నన్ను ఇంత ఆప్యాయంగా ఆదరిస్తున్నారు, అదే చాలు" అని మొహం  అదోలా పెట్టి ఆసామీ గారు భోజనానికి లేచారు. అమెరికా పద్ధతి బాగా తెలిసినట్టే ఉంది. చెప్పకండానే తన కంచం తనే తీసి కడిగారు. భోజనాలయ్యాక శివరాం తను అమెరికా వచ్చిన కొత్తలో వేసిన నాటకం వీడియో పెట్టి చూపించాడు. పిల్లల డాన్స్ కాసెట్ కూడా పెట్టబోతుంటే సఫారీ గారు చాలా సంతోషించి, వాడి కళా పోషణని పొగిడి అవతల పారేసి, నిద్ర వస్తోంది సార్ అని గెస్ట్ రూమ్‌లోకి జారుకున్నారు. ఈ మధ్య తన  ఇంటికి ఎవరు వచ్చినా సరిగ్గా అలాగే మొహం ఎందుకుపెడుతున్నారో అనేది కూడా శివరాంకి సమాధానం తెలియని ప్రశ్న.

రాత్రి రెండు గంటలకి ఏదో చప్పుడవుతుంటే శివరాం భార్య "మీ అతిథి గారు కిచెన్‌లో దేనికోసమో వెతుక్కుంటున్నారు, లేచి కనుక్కో" అని శివరాంని మరో జెల్ల కొట్టి అటు తిరిగి పడుకుంది. ఆవిడ ఇంటికి  ఎప్పుడు

వచ్చిందో శివరాంకి తెలీదు. పెళ్ళయిన కొత్తలో ఆ దెబ్బలు ఏదో సరసం అనుకునే వాడు కానీ, ఈ

మధ్యన ఇజ్రాయిల్ వాడి చేత చావు దెబ్బలు తింటున్న పాలస్తీన్ అధ్యక్షుల వారు మహారాజశ్రీ యాసర్ అరాఫాత్ వారి ఫేసూ, ఫీలింగులూ వచ్చేస్తున్నాయి.

నిద్ర మత్తులో శివరాం లేచి కిచెన్‌లోకి వెళ్ళగానే చీకట్లో అన్ని అలమారాలూ తీసి వెతికి అవతల పారేస్తున్న సఫారీ గారిని చూసి, లైటు వేస్తూ "ఏం కావాలి సార్" అని అడిగాడు.

"అబ్బే, కాస్త దాహం వేస్తేనూ, గ్లాసుకోసం చూస్తున్నాను" అన్నాడు సఫారీగారు చేతిలో ఉన్న విస్కీ బాటిల్ ఠపీమని వెనకాల దాచేసి.

"అయ్యా, అర్ధరాత్రి మీరు ఆ కార్యక్రమం మొదలుపెట్టారంటే కొంప మునిగి పోతుంది" అని శివరాం ఆయన్ని బతిమాలి మొత్తానికి ఒప్పించి, మంచి నీళ్ళు తాగించి, తను కూడా నాలుగు గ్లాసులు తాగాడు... కేవలం మంచినీళ్ళే సుమా... మింగలేక కక్కలేక ఉండే వాడి మొహం నిజంగా ఎలా ఉంటుందో ఆ రోజే మొదటి సారిగా చూశాడు శివరాం. మొత్తానికి గుట్టు చప్పుడు కాకుండా, విస్కీ బాటిలు ఆయన పెట్లో పెట్టించేసి గెస్టుగారిని పడుకోబెట్టాడు శివరాం. తను తన బెడ్ రూమ్‌లోకి వెళ్ళగానే సఫారీగారు ఎలాగూ తాగుతాడని తెలిసిన శివరాం నిన్న ప్రార్ధించిన దేవతల లిస్టు మార్చేసి, కొత్త లిస్టు అర్జంటుగా తయారు చేసి ఈ సారి అమెరికా గుళ్ళలో ఈ మధ్య బాగా పాప్యులర్ అవుతున్న"స్పెషల్ అర్చన- కేవలం 31 డాలర్లు, లేదా ఆది వారం లోపున పిల్చినవారికి డీలక్స్ అర్చన 25% డిస్కౌంటు ఇవ్వబడును" పద్ధతిలో ప్రత్యేక పూజలు మొదలు పెట్టాడు మళ్ళీ తను టెంకి జెల్లలు, తొడపాశాలూ తినకుండా రక్షించమని వేడుకుంటూ. హిందూ మతంలో ఉన్న గొప్పతనమే అది. ఎవరికి, ఏ టైములో ఏ అవసరానికైనా సరే కావలసిన కస్టమైజ్‌డు పూజలు, స్పెషల్ మంత్రాలు అందరికీ అందుబాటులోఉంటాయి. ఒకానొక మగ బల్లి ఆడవారికి కుడి తొడ మీద పడితే ఒక మంత్రం. అదే బల్లి గారి చెల్లెలు బల్లిగారు మగవాడికి ఎడమ తొడమీద పడితే మరొక స్పెషల్ మంత్రం. అలాగే భార్య జెల్ల కొడితే ఆ నొప్పి విమోచనం మరియు సమస్య పరిష్కారార్ధం అటువంటి వాటిలో స్పెషలిస్టులయిన దేవతల లిస్టు, వాళ్ళకి ప్రత్యేక ప్రార్ధనల లాటివి ఇంకే మతంలోనూ లేవు.

ఆ రాత్రి ఏ ఆర్భాటం లేకుండా, తన స్పెషల్ ప్రార్ధనల ఫలితంగా, మర్రి చెట్టులో చిలక ప్రాణంలాగా విస్కీ వ్యవహారం రహస్యం గానే ఉండి పోయింది.

అమెరికా పద్ధతి ప్రకారం ఇండియానుంచి ఆఖరికి ప్రధాన మంత్రి కాని, ప్రముఖానంద జ్ఞాన సరస్వతీతీర్ధుల ఎవారు డజను మంది శిష్యులతో కాని వచ్చినా, వాళ్ళని వీకెండ్ వచ్చే దాకా ఇంట్లో కట్టి పారేసి, వర్కింగ్ రోజుల్లో ఆఫీసుకి వెళ్ళి తీరాలి కదా! యధాప్రకారం వంటింట్లో ఫ్లాస్కులో కాఫీ పోసి, నాలుగు రొట్టెముక్కల

ా, పక్కనే బటర్ అనబడే జిగురు పదార్ధమూ, జామ్ అనబడే రంగు పదార్ధమూ, కత్తీ, కఠారులూ

కిచెన్ లో అతిథిగారి గౌరవార్ధం సిద్ధం చేశాడు. ఆయన ఇంకా జెట్ లాగ్ లేదా కనీసం విస్కీ మత్తులో అయినా గ్యారంటీగా ఉంటాడులే అనుకుని రాత్రి గండం గడిపించినందుకు ఆ కొత్తలిస్టు దేవతలకి శివరాం కృతజ్ఞతలు చెప్పుకున్నాడు. తను కూడా ఆఫీసుకి బయలు దేరుతుంటే వాడికి అత్యంత ప్రీతిపాత్రమైన ఆ గదిలోంచి అయ్యో, కుయ్యోమని సన్నసన్నగా ధ్వనులు, పాత సినిమాలలో ఏడుపు పాటలలా సన్నాయి వాయిద్యం వినపడుతున్నాయి. క్షణం ఆగిన తర్వాత, కాకినాడలో ఓఢ్రంమంగలి వాడు తన ఒళ్ళు పడుతూ మసాజ్ చేస్తున్నప్పుడు వినపడే తప తపా అంటూ తల బాదుకుంటున్న చప్పుళ్ళూ వినపడుతున్నాయి. తెల్లారకండానే గీర్వాణి ఓవర్ టైమ్ పనిచేయడానికి తన ఆఫీసుకు వెళ్ళిపోయింది. పిల్లలుసరే, ఈ వెధవ అమెరికాలో అమ్మా, బాబూ నిద్ర లేవడానికి ముందే ఐదు టన్నుల బ్యాగులు పట్టుకుని స్కూలుకి పారి పోతారు. అందుచేత, వీక్ డే నాడు పొద్దున్న ఆరు గంటలు దాటాక ఆగదిలో ఉన్న వారు ఖచ్చితంగా అతిథి దేవుళ్ళు మాత్రమే అనే తన బ్రిలియంట్ థీరీ ప్రకారం ఆ గర్భశోక ధ్వనులన్నీ సఫారీ గారి బాపతు అని శివరాం కనిపెట్టేశాడు.

ఈ గెస్ట్‌గారికి ఏమయిందో అని కొంచెం అనుమానంగా శివరాం ఆ గది తలుపు మెల్లిగా తడుతూ "ఏమయి ంది సార్?" అని సఫారీగారిని వాకబు చేశాడు.

"ఏమీ అవటల్లేదు, సార్. అయితే గొడవేముంది." వాపోయాడు సఫారీ గారు.

"ఏమిటి అవ్వాలి సార్, కెన్ ఐ హెల్ప్ యూ?" శివరాం ఈ సారి ప్రయత్నించి ట్యూబులైటు వెలిగించుకునేం త అవకాశం లేదు. ఎందుకంటే ఆఫీసుకి టైమయిపోతోంది.

"కెన్ ఐ హెల్ప్ యూ ఏమిటయ్యా చస్తుంటేనూ, ఈ విషయంలో తమరి బాబు మరియు తాతగారు కూడా ఏమి చెయ్య లేరు." గద్గద స్వరంతో సమాధానం చెప్పబోయాడు సఫారీ. ఇంకా అసలు సంగతి అర్ధంఅవక, ఆ గదిలో పొరపాటున టవల్ కానీ, బాత్ రూమ్ టిష్యూ, సబ్బు కానీ పెట్టడం మర్చిపోయానేమో అని అ నుమానంగా "ఏమండీ, బాత్ రూమ్ టిష్యూ అన్నీ ఉన్నాయా" అంటుండగా, సఫారీ గారు ఠపీమని బయట కి వచ్చేశారు.మొహం ఎర్రబడిపోయింది. చెమట్లు కక్కుతున్నారు అప్పుడే ఎక్సర్‌సైజ్ చేసి వచ్చిన జార్జి బ ుష్‌లా.

"అయ్యా, అన్నీ ఉన్నాయి మీ ధర్మమా అని. కానీ అసలుదే లేదు. మీరు ఏమనుకున్నా సరే. ఇక లాభం లే

దు" అని తన గదిలోకి వెళ్ళి ఒక సిగరెట్ పాకెట్టు, అగ్గి పెట్టే పట్టుకుని మళ్ళీ బాత్‌రూమ్‌లోకి పారిపోయారు సఫారి గారు.

"బాబోయ్, మా ఇంట్లో ఏక్కడైనా సరే సిగరెట్లు కాలిస్తే మా ఆవిడ చంపేస్తుంది....ఆ గదిలో సిగరెట్టు కాలిస్తే నేను మళ్ళీ చంపేస్తాను, పోనీ బయటకి పోయి కాల్చుకోండి " అని శివరాం ఆవేశపడుతుండగా ఆ గదిలోం చి అయ్యో, కుయ్యోలు పోయి హమ్మయ్య లాటి ఆహ్లాదకరమైన ధ్వనులు వినిపించాయి.

"అన్నట్టు, మీరు వెళ్ళే ముందు మీ ఇంటి తాళాలు డైనింగ్ టేబుల్ మీదో ఎక్కడో పెట్టి వెళ్ళండి. మీరు చె ప్పినట్టుగా బయటకి వెళ్ళి సిగరెట్ కాల్చుకుంటాను మీకు ఇంక ఇబ్బంది కలిగించకుండా, ప్లీజ్ " సఫారీగా రు ఆ గదిలోనించే అభ్యర్థించారు.

ఈ సారి మింగలేకా, కక్క లేకా మొహం పట్టే అవకాశం శివరాంకి వచ్చింది. ఆ పాత్రపోషణ అద్భుత ంగా చేసి సిగటెట్టు, టెంకిజెల్ల మాట దేవుడెరుగు, ఉన్న ఉద్యోగం కూడా ఊడుతుందేమో, అసలే ఇవాళ శ ుక్రవారం అని శివరాం ఆఫీసుకి పారిపోయాడు.

ఆఫీసుకి వెడుతుండగా ఎందుకో పాతికేళ్ళ క్రితం మొట్టమొదటి సారి తన ఇంటికి వచ్చిన అతిథి, కుచేల భాగవతార్ గారు సడెన్ గా జ్ఞాపకం వచ్చాడు. ఆయన అమెరికాకి మొదటి తరం అతిథి. ఆ తరం ఇండియ ా గెస్టులు తమ కవిత్వమో, నైపుణ్యమో అమెరికాలో మన వాళ్ళకి చూపిద్దామనే ముఖ్యంగా వచ్చే వారు. అ మెరికాలో డబ్బు సంపాదించి అమ్మాయి పెళ్ళి చేద్దామనో, ఇంటికి సున్నం వేయిద్దామనో ముఖ్య ఉద్దేశం కా దు. ఆయన భయం, భయంగానే ఉన్నాడు పాపం అమెరికా అనగానే. అసలైన పండితుడిలాగా పంచ, లాల్చీ, కండువా వేసుకుని హుందాగానే ఉన్నారు. ఆ రోజుల్లో ఈ-మెయిల్స్, చవకగా ఫోన్ చెయ్యడాలూ వగైరా ఏమీ లేవు. ఆంతా ఏడాది పాటు ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారానే ఆయన అమెరికా ఏర్పాట్లు జరిగాయి. ఆ యన వచ్చిన మొదటి రోజు ఆ గదిలోకి వెళ్ళాడు అవసరార్థం. ఆ రోజుల్లో ఇండియాలో స్నానాల గదులన్నీ ఇరవై నాలుగ్గంటలూ తడి తడిగా ఉండేవి. ఒక మూల బకెట్టు, చెంబూఉండేవి. తువ్వాళ్ళుబయట ఏ తడ కమీదో ఆరేసి ఉండేవి. చిన్న కార్యానికి సువిశాలమైన వీధులే ఉండేవి. పెద్ద కార్యానికి మటుకుఇంటికి దూరంగా చిన్న గదిలో మరొక బకెట్టూ, చెంబూ, నేల మీద దేవుడి పాదాలలాటి గుర్తులతో పాతాళ ప్రవేశ ద్వారం ఉండేవి. స్నానాల గదీ, చిన్నా, పెద్దా కార్యక్రమాల గదులూ అన్నీ కలిపి ఒకే గదిలో ఉండా లన్న సూత్రాన్ని తెల్లవాడు కనిపెట్టాడు. ఆ సూత్రాన్ని మన వాళ్ళు కూడా ఈ మధ్యనే ఇంపోర్టు చేసుకు న్నారు. ఎటొచ్చీ, ఆ టెక్నాలజీని మనకి అన్వయించి, ఆ గదులన్నీ ఇరవై నాలుగు గంటలూ పాతరోజుల లాగానే తడిగా ఉంచుతున్నారు. అన్నింటికన్నా ముఖ్యం ఆ రోజుల్లో అమెరికా రావడానికి ప్రత్యేకంగా ట్రెయినింగ్ ప్రో

గాములు ఉండేవి కాదు. అంతా ఆన్ ది  జాబ్ ట్రెయినింగే. అంటే ఏ రంగు కుళాయి ఎటు

తిప్పిన గోరు వెచ్చటి నీళ్ళు వచ్చును, ఎంత తిప్పిన ఒళ్ళు కాలి పోవును మొదలైన వషయాలన్నీ ఇక్కడికి వచ్చి నేర్చుకోవలసిందే. కుచేల భాగవతార్ గారు వచ్చిన నాడు అవసరం వచ్చి శివరాం చూపించిన ఆ గది లోకి వెళ్ళగానే తనకి అలవాటయిన సీనరీ కానీ గదిలో సహజంగా ఉండవలసిన దోమలు కాని, వాసనలు కానీ, కనీస అవసరాలైన బకెట్టూ, చెంబూ ఎంత మాత్రం లేక పోగా, శివరాం వెదజల్లిన సుగంధ ద్రవ్యాలు, అగరొత్తులని మించిన సువాసనలు తగలగానే పొరపాటున పూజ గదిలోకి వెళ్ళి పోయామేమో అని లెంపలు వాయించు కుంటూ ఆ గదిలోంచి రపీమని బయటకి వచ్చే శారు. ఆ తరం అతిధులు వినయంగా, అభిమానం గా, భేషజాలు లేకుండా ఉండేవారు. అమెరికా గురించి అన్నీ తెలుసున్నట్టు నటించే వారు కాదు. ఒళ్ళు కాలిపోయినా, చీజ్ లేదా ఇక్కడి బటర్ వాసనకి కడుపు తిప్పినా, ఎయిర్ కండిషనింగ్‌కి గజ గజా వణికి పోయినా ఎవరికీ చెప్పేవారు కాదు. అన్నింటికీ సద్దుకుపోయే వారు.

ఇంటికి వెళ్ళగానే జరగబోయే రకరకాల సినేరియోలకి తను ఏవిధంగా వ్యవహరించాలి అని ఆలోచించి, రకర కాల ఏక్షన్ ప్లానులు సిద్ధం చేసుకున్నాడు. ఆఫీసులో క్షణక్షణానికీ ఆ సాయంత్రం ఇంటికి పోవలెనా, పోతినిబ లో అప్పుడు జరుగు విశేషములు ఆరోగ్యకరములా, ఇంటికి వెళ్ళని పక్షమున ఎచటికి పారిపోయి,    ఎన్నాళు ళ్ళ దాక్కొనవలయును అని తర్జన భర్జన చేస్తూనే ఉన్నాడు. డైనింగ్ టేబుల్ మీద కాళ్ళు, విస్కీ      బాటిలూ పెట్టుకుని సిగరెట్టు తాగుతున్న సఫారీ గారి దివ్వ మంగళ విగ్రహాన్ని తన భార్య ఇంటికి రాగానే  వీక్షిస్తున్న సినేరియో తలుచుకోగానే ముచ్చెమట్లు పట్టేశాయి. మొత్తానికి ఇంటికి వెళ్ళడానికే నిశ్చయించు    కున్నాడు
.

డ్రైవ్ వేలో భార్య కారు ఉంది. దాన్ని చూడగానే దెయ్యాన్నో, భూతాన్నో చూస్తున్న ఫీలింగు    అనాలోచి తంగా వచ్చేసింది. భయం, భయంగా ఇంట్లో అడుగు పెట్టాడు. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. ఎక్కడా ఏ విధమై న చప్పుడూ లేదు.

"హలో, ప్రేయసీ, హౌ ఈజ్ యువర్ డే" అని అనేక సార్లు పొద్దుటినుంచీ రిహార్సల్స్ చేసిన కారణం గా పెర్ఫె ఫెక్ట్ గా డైలాగ్ డెలివరీ చేశాడు శివరాం. సమాధాం లేదు. అంతా విపరీతమైన సస్పెన్సు.

" మన గెస్ట్ గారు పాపం నిన్నంతా ప్రయాణం చేసి అలిసి పోయారు. పాపం నిద్ర పోయారేమో,    చూస్తాన ండు. కాస్త కాఫీ తాగుతారేమో"అంటూ చల్లగా లోపలికి వెళ్ళాడు శివరాం. ఇల్లంతా వెతికినా      సఫారి మనిషి ఆచూకీ కనపడలేదు. ఆయన సామాను గానీ, అసలు ఒక పై మనిషి ఈ ఇంటికి వచ్చిన      సూచన

లు కాని ఎక్కడా లేవు. చచ్చాంరా రా బాబూ, అనుకున్నదానికన్నా పరిస్థితి చాలా అన్యాయంగానే

ఉందన్న మాట. షి మస్ట్ హేవ్ కిక్డ్ హిమ్ ఔట్ అల్ రెడీ అనుకుంటూ కిచెన్‌లోకి వెళ్ళాడు ఏడవాలో, నవ్వాలో తెలియని ఫీలింగుతో.

"అవునూ, ఇంట్లో ఎవరూ లేరే, మన గెస్ట్ గారిని ఎక్కడైనా డ్రాప్ చేశావా, హనీ?" అడిగాడు శివరాం చాలా కాజువల్ గొంతుకతో. హనీ అన్నప్పుడు మటుకు గొంతు కాస్త వణికినట్టు అనుమానం.

"నేనా, బావుంది వరస. ఐ జస్ట్ గాట్ హోమ్. ఆయన ఎక్కడికి వెళ్ళాడో, ఎలా వెళ్ళాడో నాకేం తెలుసు. అదిగో ఆ డైనింగ్ టేబిల్ మీద నీకే అనుకుంటాను ఏదో నోట్ ఉంది, చూసుకో." గర్జించింది గీర్వాణి.

శివరాం ఉత్తర్తం విప్పాడు.

"అయ్యా, శివరాం గారూ,

నన్ను ఎయిర్ పోర్టు నుంచి మీ ఇంటికి తీసుకొచ్చి రాత్రి భోజనం పెట్టినందుకు నా కృతజ్ఞతలు. ఈ కవరులో $2.99 కేష్ పెట్టాను. అనుభవించండి.

అంతా బాగానే ఉంది కానీ ఇంటికి వచ్చిన వారికి కొన్ని ప్రత్యేకమైన అవసరాలు ఉంటాయని మీరు గ్రహించకపోవడం, తెలిసిన తర్వాత కూడా ఆ అవసరాలు తీర్చే ఏర్పాట్లు మీ అంతట మీరు చెయ్యక పోవడమే కాక,నా అంతట నేను, ఇండియాలోనే మీ ప్రఖ్యాతి (నిజానికి అపఖ్యాతి) విని నా ఏర్పాట్లు నేను చేసుకున్నప్పటికీ నన్ను నివారించడం చాలా శోచనీయం. ఈ రోజుల్లో ఇండియాలో చీకటి పడగానే, భోజనానికి ముందూ, ఆ తర్వాతా కూడా, జీర్ణశక్తి ఆభివృద్ధికి కాస్తో కూస్తో దాహం పుచ్చుకోవడం, పొద్దున్నే సుఖ విరోచనానికి సిగరెట్టు తాగడం నాకే కాదు, కళాకారులకీ, కవులకి, వ్యాపారవేత్తలకి, బ్యాంకు గుమాస్తాలకీ అందరికీ తెలిసిన సాంప్రదాయం. అందుకే వాటిని మందూ, మాకూ అని వ్యవహరిస్తారు. అది మన తెలుగు నాగరికతలో ముఖ్యమైన భాగం. మీలో చాలామంది అమెరికా వచ్చి మన నాగరికతలో అతిథులని చూడవలసిన నియమాలని మర్చిపోయి, మీ అనారోగ్యకరమైన పద్ధతులని మామీద రుద్దుతున్నారు.

ఇక అమెరికాలో మీ మహాసభలంటారా? అవి సాధిస్తున్న సో కాల్డ్ ఘన విజయాల గురించి ఆంధ్ర ప్రదేశ్‌లో ఎవర్నడిగినా చెప్తారు. వీలుంటే నేను తయారు చేసిన www.TANTA.com అనే వెబ్ సైట్ చూడండి.

TANTA అంటే తంటాలూ కాదు, తంతాను సుమా అనీ కాదు. అమెరికాలో ఉన్న TANA, ATAలు రెండూ ఆ TANTA లో మీకు కనిపిస్తాయి. ఆ వెబ్ సైట్ లో అమెరికాలో ఏ ఊళ్ళో కలాపోస కులున్నారో వారి ఫోన్ నెంబర్లు, ఎడ్రసులు, జాతక చక్రాలూ, ఇండియాలో ఉన్న వాళ్ళ బంధువులూ మొదలైన వివరాలన్నీ ఉంటాయి. అందులో ముఖ్యమైన వివరం ఏ కలాపోసకుడు ఎటువంటి ప్రోగ్రాముకి ఎంత విరాళం ఇస్తాడూ అనేది. అవధానం కార్యక్రమానికి అర్ధణా కూడా ఇవ్వక పోయినా, వెకిలి వేషాలు వేసే సినిమావాడికి విందుభోజనం, వెయ్యిడాలర్ల విరాళం ఇచ్చిన డాక్టరుగారు ఏ ఊళ్ళో ఉన్నారు మొదలైన వివరాలన్నీ ఉన్న ఒక ఆంతరింగక కంప్యూటర్ ప్రోగ్రామ్ హైదరాబాద్ లో నా ఆధ్వర్యంలో తయారయింది. ఆ వెబ్ సైట్ నా వ్యాపారం. ఆ డేటాబేస్ అప్‌డేట్ చేసుకోడానికి ఇప్పుడు నేను అమెరికా వచ్చాను. చిన్న కళా కారులూ, అవార్డులు, పురస్కారాలతో పండిపోయిన వారూ కూడా ఇందులో ఇన్‌ఫర్మేషన్ కొనుక్కుని అమెరికాలో డబ్బు సంపాదించడానికి ఒక టార్గెట్ లిస్ట్ తయారు చేసుకుంటారు, నక్సలైట్లు భూస్వాముల హిట్ లిస్టు లాగ. దేశాన్ని వదిలి వచ్చేశామన్న మీ గిల్టీ ఫీలింగ్‌ని కేష్‌గా మార్చుకోడానికి చాలామంది అమెరికా వస్తున్నారు. వాళ్ళు పైకి మిమ్మల్ని ఎంత పొగిడినా అది కేవలం "పోనీలే, ఏదో అవస్త పడుతు న్నారు" అనే కానీ అవి నిజమైన అభిప్రాయాలు కాదు. మీరు పడే కష్టాలూ, నిస్సారమైన మీ జీవితాలని చూస్తే మాకు చాలా జాలి. ఇండియా ఎంత ఎడ్వాన్స్ అయిందో మీకు తెలియక, మీ అమెరికా తెలుగు వాళ్ళు చాలా మంది “Frozen in the past”.

అన్నట్టు మా వెబ్‌సైట్‌లో మీ విషయాలు కూడా ఉన్నాయి, ఇంటికి వచ్చిన ప్రతివారికీ మీరు ఇక్ష్వాకుల కాలంలో అమెరికాలో ఆముదం వృక్షంలా ప్రదర్శించిన ఆ చచ్చు నాటకం చూపించడంతో సహా.ఇక మీ విరాళ స్థాయిసరే, మా ఊళ్ళో రిక్షావాడు అంతకంటే నయం.

అన్నట్టు, రేపటి మీ దేశవాళీ సభలలో అధికారి అయిన ఒకాయన మా నాలుగో బావ మరిది. అందుచేత నేను అమెరికా రావడానికి అతి ముఖ్యమైన అతిధిగా నన్ను అభివర్ణిస్తూ అఫియల్ లెటర్ హెడ్ మీద, ఎవరికీ తెలియకుండా, ఇచ్చిన ఆహ్వానం మూలాన నాకు వీసా వచ్చింది. మీ ఊళ్ళో ఆతిధ్యం ఇచ్చే హోస్ట్‌లందరూ అప్పుడే బుక్ అయిపోయారు కాబట్టి, నిన్న సాయంత్రం మా బావ మరిదికీ, అతని భార్యకీ ఎయిర్ పోర్ట్‌కి రావడానికి వీలుపడదని ఆఖరి క్షణంలో తెలిసి, గత్యంతరం లేక, హోస్ట్ కమిటీ ద్వారా మీరు నన్ను రిసీవ్ చేసుకుని ఒక పూట ఆతిధ్యం ఇచ్చే ఏర్పాటు చేశాడు. మీకూ, అతనికీ పడదని తెలుసు కాబట్టి, హోస్ట్‌కమిటీ ఎవరికీ, మీకూ ఈ విషయం తెలియకండా జాగ్రత్తపడ్డాం. మీసంగతి, ఇండియాలో నాకే కాకుండా, ఇక్కడ

అతనికి కూడా తెలుసు కానీ, ఒక పూటకి సద్దుకు పోవచ్చులే అని మేం ఇద్దరం అనుకున్నాం. మేము

ముందుగా ప్లాన్ చేసుకున్నట్టుగానే ఇవాళ పొద్దున్న మీరు ఆఫీసుకి వెళ్ళగానే అతను వచ్చి నన్ను వాళ్ళింటికి తీసుకెళ్ళాడు. ఈ ఏర్పాటు మేము ముందే చేసుకున్నాం. అందుకే నేను అంత తొందరగా లేచి, కాలకృత్యాలు తీర్చుకుని రెడీ అవడానికి మీకు అతిప్రీతిపాత్రమైన ఆ చచ్చు గది లోకి వెళ్ళి నా ప్రాణం మీద కి తెచ్చుకున్నాను. పొద్దున్న లేవగానే సైమల్టేనియస్‌గా సిగరెట్టు తాగకపోతే నా పని ఉట్టిదే అని ఈ పాటికి తమరు గ్రహించే ఉంటారు. ఇప్పుడు మా బావమరిది ఇంట్లో నా ప్రాణం హాయిగా ఉంటుంది. ఒక వేళ ఎల్లుండి మహా సభలలో, ఆ పదివేల మందిలో ఎక్కడయినా కనపడితే మనిద్దరం ఇంకా మనసు విప్పి మాట్లాడుకోవచ్చును.

భవదీయుడు,

(దడిగాడు వానసిరా)

ఈ మాట మా చిన్నప్పుడు తెలుగు మేస్టారు నేర్పారు. పూర్తి అర్ధం నాకు తెలియదు కానీ, తమాషాగా ఉంటుంది కదా అని వాడుతున్నాను)

P.S: నిన్న రాత్రి మీ శ్రీమతితో కేవలం నమస్కారం పెట్టడం తప్ప ఎక్కువగా మాట్లాడడం కుదరలేదు. కానీ రాత్రి భోజనం, పొద్దుట ఆవిడ కిచెన్‌లో నా కోసం ఏర్పాటు చేసిన కాఫీ, బ్రెడ్డు, జామ్ వగైరాలు చాలా బావున్నాయి. ఆవిడకి నా కృతజ్ఞతలు. మీ ఇంటి తాళాలు ముందు కాళ్ళు తుడుచుకోడానికి వేసిన కొబ్బరి చాప క్రింద పెట్టాను. నిష్కర్శగా మాట్లాడడం నాకు అలవాటు. అందుకే అన్ని విషయాలు వివరంగా వ్రాశాను. ఇవన్నీ మీ ఆవిడకి చెపితే మీకే నష్టం. ఆవిడ మిమ్మల్ని చూసే పద్ధతి కూడా మా వెబ్‌సైట్ లో ఉంది.